
కథ

రింగ్‌టోన్ ఫోబియా....
ఇలాంటి పేరున్న వ్యాధి మెడికల్ డైరక్టరీలో వుందో లేదో తెలీదు. అసలింతకీ యిది వ్యాధి అవునో కాదో తెలీదు. సైకియాట్రిస్టుల వద్దకి ఈ రకం రోగులు వచ్చారో లేదో కూడ తెలీదు. కాని బ్యాంకులో యే టేబిల్ మీద ఫోను మోగినా, తన గుండెల్లో బాంబు పేలినంతగా భయపడిపోతోంది మల్లీశ్వరి.

# పసిడి రెక్కల కాలం

—ఈతకోట సుబ్బారావు



గత పది, పదిహేను రోజుల లగాయితు యిదే తంతు. బ్యాంకులో అడుగుపెట్టే ప్రతి ముఖాన్ని ఆడా మగా అన్న తేడా లేకుండా బైనాక్యులర్ చూపులతో తవ్వి తవ్వి మరీ పరీక్షించేస్తోంది. డ్యూటీ చేసే ఎనిమిది గంటల్లో హీన పక్షం యాభై సార్లన్నా ముఖానికి చెమట పట్టడం, ఆ చెమటని టర్కీ తువ్వాలుతో వొత్తుకోవటం చేస్తూనే వుంది.

టెలిఫోన్ మోగితే చాలు, దాంతో పాటు గుండెలూ దడదడలాడుతున్నాయి.


అప్పటికీ టీ.వీ. పెట్టకూడదనీ, వుదయాన్నే పత్రికలు చదవ కూడదనీ యెన్నోసార్లు అనుకుంది. అయినా మనసు కుదుటగా వుంటేగా. ఏ రోజు యే కన్నగుండెల్లో బాంబు పేలిందో, యే ఆడపిల్ల జీవితం అర్ధాంతరంగా ముగిసి పోయిందో !

అనూహ్యంగానే చేతుల్లోకి రిమోట్ వచ్చేస్తుంది. వార్తలొచ్చే ఛానళ్ల మీట వేళ్లు నొక్కేస్తాయి.

వూహించినట్టుగానే యెక్కడో వో చోట, యేదో వోవూళ్లో యెవడో వొక రాక్షసుడు, పసి పాప దగ్గర్నుంచి, కన్నె పైట వేసుకొన్న అమ్మాయిల దాకా యెవరో వొకరి ప్రాణాలతో ఆడుకుంటూనే వుంటాడు.

మొగ్గ ప్రాణాలపై గొడ్డలి వేటు పడుతూనే వుంటుంది.

సరిగ్గా అలాంటి సమయాల్లోనే ల్యాండు ఫోను



ట్రింగ్...ట్రింగు మని మోగుతుంది. అంతే... మల్లీశ్వరి గుండె యెండుటాకులా వణుకుతుంది.

అన్నింటికీ కారణం వొకటే.

తన ఆరేళ్ల కూతురు ప్రణవి. కాన్వెంట్లో చదువుతోంది. తను బ్యాంకులో క్యాషియరు. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. ఇద్దరి జీతం కలిపితే నెలకు అరవైవేల పైమాటే. కాని యిరుగు - పొరుగు గుసగుసల్లో అది నెలకో లక్ష. అందరి కళ్లూ తమ పైనే.

ఆ కారణంతోనే భయంతో లోలోన కంపించిపోతోంది మల్లీశ్వరి.

అంతక్రితం అలాంటి సంఘటనల్ని వార్తలుగా, వార్తా చిత్రాలుగా చూసినపుడు గుండె జల్లుమనేది. బలైపోయిన ఆడకూతురు తాలూకు తల్లిదండ్రుల మనోవేదన వూహించుకొని కొద్దిగానో, యింకొద్ది యెక్కువగానో ఆవేదనకు లోనయేది. ఇప్పుడలా కాదు. పరిస్థితి మారింది. గుండె జల్లుమనడం లేదు. వొణుకుతుంది. ముచ్చెమట్లు పడుతున్నాయి. నిన్నా-మొన్నటి దాకా మేమిద్దరం, మా కొక్కరు - చిన్న కుటుంబం, చింతలేని కుటుంబమని వొకింత గర్వపడేది. కాని యివాళ పరిస్థితి అందుకు భిన్నం. పెద్దదిక్కులేని కుటుంబం. అందరూ వున్న అనాథ అనిపిస్తోంది.

అంట్లు తోముతూ- ''అమ్మా బ్యాంక్‌లో డబ్బంతా మీ చేతుల్లోనే వుంటుందంట గదా? డబ్బు కట్టలు లెక్క పెట్టేది కూడ మీరేనంటగా !'' అహఁ...నా మాట కాదమ్మా ! కాలనీలో అందరూ అనుకొనేదే'' అంటూ రాములమ్మ అన్న మరుక్షణం అదాటుగా వులిక్కిపడింది. అదే తొలిసారి. అది మొదలు ఆడపిల్లల కిడ్నాప్‌లు, రేప్‌లు, హత్యలు అన్నీ బాగా తెలిసిన వారు చేసిన దురాగతాలే అన్న కథనాలు చదివి వులికిపాటు యింకా ఎక్కువైపోయింది మల్లీశ్వరికి.

తన కన్నతండ్రిని వృద్ధాశ్రమానికి పంపించేసిన రోజునించీ భర్త సుధాకర్ యింటి విషయాలు పట్టించుకోవటం దాదాపుగా మానేశాడు. ప్రణవి ఆలనా - పాలనా కూడా తన వొంటి చేతి మీదుగానే. నెలకో ముప్ఫైఐదువేలు తెచ్చి చేతుల్లో పెట్టడం వరకే భర్తగా సుధాకర్ యింట్లో నెరవేర్చే డ్యూటీ, అంతకు మించి వొక్కో అనుబంధానికీ, అనురాగానికీ దూరం పెంచుతూ పోవడమే కాని తండ్రిని మాత్రం మర్చిపోలేక పోతున్నాడు.

''ఏమండీ ! కాఫీ...'' అంటూ మల్లీశ్వరి కాఫీ పట్టుకెళ్లి యిచ్చినా జీవితంలో బెడ్‌కాఫీ తాగే రోజులు జారిపోయాయి, అక్కర్లేదంటూ ముఖాన్నే తిరస్కారం చవిచూడాల్సి వస్తోందిప్పుడు.

చివరకి పర్సు మర్చి వెళ్తుంటే గుర్తు చేసినా ''నాకు తెలిసే పెట్టానులే. అక్కడే పెట్టేయ్...'' అంటూ గుమ్మం దాటేస్తున్నాడు.

ఇద్దరి మధ్యా దూరం పెరుగుతున్న వాస్తవం కళ్ల ముందు కదులుతున్నా, తను చేసిన పొరపాటు తనకు తెలిసినా, సుధకర్‌ని క్షమించమని అడగలేకపోయింది మల్లీశ్వరి. ఇగో కారణం కావచ్చు. లేదా తను చేసిన పొరపాటు క్షమాపణ అడగాల్సినంత అవసరమైంది కాదు అనుకొని వుండొచ్చు.

''అయినా తనేం చేసిందని? అరవై.. సిక్స్టీ ప్లస్‌లో వున్న శంకర్రావు గారిని థర్టీల్లో వున్న తమ మధ్య ఇబ్బందిగా భావించి ధనవంతులు మాత్రమే నివసించగలిగే ఖరీదైన వృద్ధాశ్రమంలో చేర్పించింది. నెలకి పదివేలు. తను కడుతున్నా భర్త కడుతున్నా ఆయన మాత్రం సుఖంగానే వున్నాడు. అటువంటప్పుడు క్షమాపణ అడగాల్సిన అవసరం కన్పించలేదు మల్లీశ్వరికి.

కాని ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ఇప్పుడు భయం నీడలోనే అడుగైనా, బతుకైనా.

చాలామంది జనం యీజీమనీకి అలవాటు పడిపోయారు. ఉన్న ఫళంగా లక్షలు లక్షలు సంపాయించేయాలన్న దురాశ. అన్ని సుఖాలూ కొనేయాలన్న ఆశ. ఆ డబ్బు పొందడానికి దేనికైనా సిద్ధం. చంపడానికైనా, చివరకి సర్వనాశనం చెయ్యడానికైనా. కారణం నిరుద్యోగం కాదు. ఆలోచనలో ఆచరణలో క్రమశిక్షణ లోపించడమే !

ప్రణవిని వుదయాన్నే ఆటో పికప్ చేసుకుంటుంది. స్కూల్లో దింపి వెళ్లిపోతుంది. తిరిగి సాయింత్రం అదే ఆటో యింటి దగ్గర వొదిలి పెడుతుంది. ఆటో డ్రైవర్ సాజిద్ బాషాకి తనే పూచి యిచ్చి ఆటో కొనేందుకు లోన్ యిప్పించింది. పైగా ఐదేళ్ల నుండి సాజిద్ వాళ్ల కుటుంబంతో సత్సంబంధాలున్నాయి మల్లీశ్వరికి. అటు వైపు నించి భయం లేదావిడకి, పని మనిషి రాములమ్మ మీద కూడ నమ్మకమే. విపరీతంగా తాగుడికి బానిసైన రాములమ్మ భర్తకి 'డి-ఎడిక్షన్ థెరపీ' చేయించింది తనే. ఇప్పుడతను బుద్ధిగా ఓ జ్యువెలరీ షాపులో నైట్ వాచ్‌మెన్‌గా డ్యూటీ చేసుకుంటున్నాడు. తన కాపురం నిలబెట్టిన చల్లని తల్లి అని రాములమ్మ చాటే కృతజ్ఞత మల్లీశ్వరికి తెలుసు.

అయినా ఆమెకి భయమే. గుండెల్ని తొలిచేసే భయం వూపిరిని కూడా వొణికించే భయం.

ప్రణవిని ఎవరైనా కిడ్నాప్ చేస్తారేమో అన్న భయం !

కాలనీ అందరి దృష్టిలో తను లక్షాధికారి. బ్యాంకులో లావాదేవీలూ, జమాఖర్చులూ అన్నీ తన చేతులు మీదుగానే జరుగుతాయన్న అపోహ. రోజూ తను కొన్ని లక్షలు లెక్కగట్టి ఐరన్ సేఫ్‌లో పెట్టి వస్తుంటానన్న మిడి మిడి జ్ఞానం. ఇలాంటి అర్థం లేని వూహలే డబ్బు సంపాయించాలనుకొనే వాళ్లని రెచ్చగొడ్తాయి. వాళ్ల చేత ముందు కిడ్నాప్‌లు చేయిస్తాయి. తర్వాత తమ గుట్టు బైట పడ్తుందేమో అన్న భయం వాళ్లు హత్య చేయడానికి పురిగొల్పుతుంది.

నిన్నా మొన్నటి శిరీష వుదంతం, తిరుపతిలో బాలిక కిడ్నాప్-హత్య, అంబర్‌పేటలో మమత ఇంకా...ఇంకా... ఎన్నో ఎన్నెన్నో దిన పత్రిక తెరిస్తే యిలాంటి వార్తలెన్నో. వార్తా ఛానెళ్లలో యిలాంటి వుదంతాలెన్నో. వాటిని చదివినప్పుడో, చూసినప్పుడో మల్లీశ్వరి కళ్ల ముందు ప్రణవి ముఖమే



## యాంగ్రీ యంగ్ 'వుమన్'

ఇప్పటి వరకూ కత్రినా కైఫ్‌ను హీరోలపై హొయలు వలకబోసే పాత్రల్లోనే చూసారు ప్రేక్షకులు. ఇక ముందు విలన్‌లపై నిప్పులు కురిపించే పాత్రల్లో కూడా చూసి ఆనందించవచ్చు. ఇటీవలూ విడేదలైన 'సింగ్ ఈజ్ కింగ్'లో ఆమె హెలీకాప్టర్‌పై నుండి దూకే సన్నివేశం ఒకటి ఉంది. అయితే ఇది చిన్న శాంపిల్ మాత్రమేనని, ప్రస్తుతం తాను ఒక పూర్తి యాక్షన్ చిత్రంలో నటించే సన్నాహాల్లో ఉన్నానని చెప్తోంది కత్రినా. ''ఆ ఒక్క యాక్షన్ సన్నివేశంతో నేను యాక్షన్ హీరోయిన్ అయిపోయినట్టు కాదు. ఒక పూర్తి యాక్షన్ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. దాన్ని నా పూర్తి యాక్షన్ చిత్రంగా చెప్పు కోవచ్చు. అయితే దీనికోసం నేను కాస్త కష్టపడక తప్పేట్టు లేదు. రెండు నెలలు కఠిన వ్యాయామం, శిక్షణ అవసరపడతాయి.'' కత్రినా కెరీర్‌లో చెప్పుకోదగ్గ ఒక్క హిట్టూ లేకపోయినా, అందాల ఆరబోతకు అభ్యంతరం లేని అమ్మాయి కాబట్టి అవకాశాలకేం కొదవ లేదు. ప్రస్తుతం సుభాష్ ఘాయ్, రాజ్‌కుమార్ సంతోషి, కబీర్ ఖాన్‌లాంటి ప్రముఖ దర్శకుల చిత్రాల్లో నటిస్తోంది.

కదలాడుతుంది. అదీ రక్తసిక్తంగా. ఆ భయం గుండెల్ని వొణికిస్తుంది.

ప్రణవి ఆటో యెక్కి స్కూలు కెళ్లిం దగ్గర్నుంచీ భయం... భయం... అనుమానాలు, అస్తవ్యస్తమైన ఆలోచనలు. ఫోను మోగితే యేదో జరిగి పోయిందన్న వూహ. సాయింత్రం యిల్లు చేరుకొని ప్రణవిని చూసిందాకా యిలాంటి భయాలతోనే రోజు గడుస్తుంది మల్లీశ్వరికి.

బ్యాంకులో మీసాలు కాస్తంత గుబురుగా వున్న యే కస్టమర్ కనిపించినా వులికి పడుతుంది. కొత్త ముఖం కంట బడ్డా గుండెలు దడదడలాడుతుంటాయి.

ప్రతి ముఖాన్నీ అనుమానంగా చూడ్డమే.

ప్రతి క్షణం భయంతో బతకడమే.

ఈ భయంతో బతకడం క్షణ క్షణం నరకంగా వుంది. శ్వాస పీలిస్తే భయం. శ్వాస వొదలాలన్నా భయం. నాలుగు కన్నీళ్లని భరించవచ్చు. వొక గాయాన్ని భరించవచ్చు. చివరికి వొంటిపైన వో కత్తిగాటు నైనా భరించవచ్చు. కాని అనుక్షణం వూపిరిలో వూపిరిగా కలిసి గుండె పైకి పాములా పాకులాడే భయాన్ని మోస్తూ బతకటం మాత్రం కష్టం.

ఈ కష్టాలన్నీ భూమ్మీద తరాలుగా వున్నవే. తనకు మాత్రం ప్రణవిని కన్న తర్వాతే చుట్టు ముట్టాయి.

రేపట్నుంచి ఎంత కష్టమైనా ప్రణవితో పాటు తనూ ఆటోలో వెళ్లాలి. స్కూలు వొదిలే వేళకి గేటు దగ్గర్నుంచే ప్రణవి చేయిపట్టుకుని తనతో కూడా యింటికి తీసుకురావాలి. ఎటూ బ్యాంకుకీ, స్కూలుకీ మధ్య వున్న దూరం అరకిలోమీటరే- బ్యాంకు నుండి బైట పడుతూ అనుకొంది మల్లీశ్వరి.

సరిగ్గా అదే సమయానికి రోడ్డు మీద యెవరిదో శవయాత్ర. భారీ సంఖ్యలో జనం. ''నిన్న బోరబండ స్కూల్లోంచి కిడ్నాప్ చేసిన అమ్మాయి. పాపం ఆరేళ్లే... నూరేళ్లూ నిండిపోయాయి'' తన పక్కనించి వెళ్తున్న ముసలాయన మనుమరాలితో చెప్తున్నాడు. తను చేయి పట్టుకొని మనువరాల్ని స్కూలు నించి యింటికి తీసుకెళ్తున్నాడు. ఆ పిల్ల రోడ్డు మీద కాదు, తాతయ్య గుండెల మీద నడుస్తున్నంత నిర్భయంగా నడిచి వెళ్తోంది.

మల్లీశ్వరికి తన పొరపాటే తన గుండెల్ని పిడికిట్లో నలిపేస్తున్నట్టనిపించింది. మావయ్యని వృద్ధాశ్రమానికి తరలించి తను తప్పుచేసిందా అనిపించింది మొదటిసారి. ఆ స్థానంలో తన కన్నతండ్రే వుండివుంటే అంత తెగింపు చేయగలిగేదా? ప్రణవిని ధైర్యంగా ఆయనతో పాటు స్కూలుకి పంపించి వుండేది. నిర్భయంగా నవ్వగలిగేది. ఏ సంఘటనకీ ఎండుటాకులా చలించిపోయేది కాదు.

ప్రణవిని నిత్యం రెండు కళ్లు యిద్దరు గుర్కాల్లా పహారా కాస్తుంటాయని భరోసాతో వుండగలిగేది.

ఆ అర్హత మావయ్యకి లేదా?

కాదు ఆ హక్కు మావయ్యకి లేదా అనాలి అన్పించింది. ఆ ఆలోచనే ఆమెలో కొండంత ధైర్యాన్ని నింపింది.

ధైర్యంగా రోడ్డు మీదకి చూపులు సారించింది మల్లీశ్వరి. మూసలి తాతయ్యా, ఆరేళ్ల మనువరాలు వాలుటెండలో నడిచిపోతూ కనిపిస్తున్నాడు. వాళ్లవెనకే పొడవైన వాళ్లిద్దరి నీడలూ పసిడి రెక్కల కాలం జాడల్లా వాళ్లని అనుసరిస్తున్నాయి.

మల్లీశ్వరి కాళ్లు నడుస్తున్నాయి.

స్కూలు వైపో, యింటి వైపో కాదు.

వృద్ధాశ్రమం వైపు !

*

# పోలీసులపై మండిపడుతున్న లిండ్సే



హాలీవుడ్ యువ నటి లిండ్సే లోహన్ పోలీసులు తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యానించడాన్ని జీర్ణించుకోలేక పోతోంది. పోలీసులకు, లిండ్సే లోహన్‌కు అవినాభావ సంబంధం ఉంది. ఈమె స్నేహితులు బ్రిట్నీ స్పియర్స్, పారిస్ హిల్టన్‌లు కూడా పోలీసు కేసుల్లో తరచూ అరెస్టవుతుంటారు. తాగి కారు నడపడం వల్లో, ఏదో యాక్సిడెంటు కేసులోనో, అర్ధరాత్రి పెద్ద సౌండ్‌తో పార్టీలు చేసుకుని ఇరుగు పొరుగుకు నిద్ర లేకుండా చేస్తున్నారన్న కారణం చేతనో, పేపర్ వారిపై దాడి చేసారన్న కారణంగానో- ఇలా ఈ ముగ్గురు ఏదో కేసుతో తరచూ పోలీసులకు పనిచెప్తుంటారు. ఇటీవలి వరకూ వీరి చేష్టలతో విసుగెత్తిన పోలీసులకు ఈ మధ్యనే కాస్త విరామం దొరికింది. ఈ విషయమై ఒక టీవీ విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా లాస్‌ఏంజిల్స్ పోలీస్ ఛీఫ్ ఇలా చెప్పాడు: ''మీరు పరిశీలిస్తే- బ్రిట్నీ స్పియర్స్ ఈ మధ్య పిచ్చి పిచ్చిగా బిహేవ్ చేసి మెంటల్ హాస్పిటల్స్‌లోనే ఎక్కువ సమయం గడుపుతోంది, పారిస్ హిల్టన్ నగరం వదిలి వెళ్లిపోయింది, ఇక లిండ్సే లోహన్ ప్రస్తుతం ఒక లెస్బియన్‌గా మారిపోయింది. కాబట్టి ఈ మధ్య మా సమస్యలు కాస్త తగ్గాయనే చెప్పాలి.'' ఈ వ్యాఖ్యలు చెవిన పడిన దగ్గర్నించీ లిండ్సే పోలీసులపై కారాలు మిరియాలు నూరుతోంది. ''పోలీసులు వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటే మంచిది, అందరి వ్యక్తిగత జీవితాలను వేలెత్తి చూపే అధికారం వారికెవరిచ్చారు,'' అంటూ మండిపడింది. అయితే రోన్సన్ అనే పడుచుపిల్లతో తన సంబంధం విషయంపై మాత్రం నోరుమెదపట్లేదు.

# ఆఫీసు విధులు - అనారోగ్య హేతువులు



వ్యూసోనిక్ అనే సంస్థ ఇటీవల జరిపిన సర్వేలో మనలో చాలామంది ఆఫీసు ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన నిజాలు బయటపడ్డాయి. ఈ సర్వే ఫలితంగా ఉద్యోగుల్లో 46 శాతం మంది రోజులో ఆరు గంటల కన్నా ఎక్కువ సమయం సరైన విరామం లేకుండా టేబిల్‌పై కంప్యూటర్ స్క్రీన్‌లకే అతుక్కుపోయి ఉంటారని తేలింది. వీరిలో 75 శాతం మంది నిరంతరం వెన్ను నొప్పి, చేతి కీళ్ళ నొప్పులు, కండరాల నొప్పులు, కళ్ళ సమస్యలతో బాధపడుతున్నారట. దీనికి ముఖ్య కారణం మనం ఆఫీసు పనికి ఉపయోగించే పరికరాల్లో తగిన కొలతలు పాటించకపోవడమేనని తేలింది. ఆఫీసు టేబిల్స్, కుర్చీలు సరైనవి వాడకపోవటం, టేబిల్ కుర్చీల మధ్య తగినంత ఎత్తు పాటించకపోవటం, కూర్చునే భంగిమ సరిగా లేకపోవటం, పని మధ్యలో సరైన విరామం తీసుకోకపోవడం ఇవన్నీ అనేక ఆరోగ్య సమస్యలకు కారణభూతమవుతున్నాయిట. వీటి ఫలితాలు సత్వరం కాకపోయినప్పటికీ దీర్ఘకాలికంగా ఇవి తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని వారు హెచ్చరించారు. ఆఫీసు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకున్నా తీసుకోకపోయినా, ఉద్యోగులు కూడా తమ వంతు జాగ్రత్తలు తీసుకోవటం మంచిదని వారు సూచించారు. కుర్చీలో వెన్ను నిటారుగా ఉంచి కూర్చోవటం, ప్రతీ గంటకు ఒక సారి ఐదు నిముషాల పాటు విరామం తీసుకోవటం, ఆ సమయంలో బిగిసిన కండరాలకు ఉపశమనం కలగడానికి వళ్ళు విరుచుకోవటం, కంప్యూటర్ స్క్రీన్‌పై నుంచి కనీసం ప్రతి ఇరవై నిముషాలకు ఒకసారి చూపు మరల్చటం ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే దుష్ప్రభావాల నుండి కొంత తప్పించుకోవచ్చని వారు తెలిపారు.